


హోటల్ న్యూ-సెన్సు!

పెసరట్టుకు ఒక హోటల్, ఇడ్లీ, కారప్పొడికి ఇంకో హోటల్, ఫక్తు కాఫీకి మరో హోటల్ ఇట్లాగ ఒక్కో అయిటమ్‌కి ఒక్కో హోటల్ ప్రసిద్ధి పొందడం ప్రతి ఊళ్ళోనూ వుంటుంది. ఒకచోట ఇడ్లీ తిని, మరో చోట పెసరట్టు లాగించి, మూడో హోటల్‌లో కాఫీ తాగడం మా సుబ్బ రామయ్యకి అలవాటు. అతన్తో కాఫీకి వెళ్ళినవాడు తిరగలేక చావాలి. రిక్షాకే అవుతుంది రూపాయిన్నర.

జాతి రచనలన్నీ జైళ్ళలోనే పుట్టేయంటే నే నొప్పుకోను. హోట ళ్ళలోకూడా మహత్తరమైన రచనలు ప్రాణం పోసుకున్న ఉదంతాలు నాకు చాలా తెలుసు. మల్లాది రామకృష్ణశాస్త్రి, రావూరు, పింగళి నాగేంద్రరావు, ముట్నూరి కృష్ణారావు ఇత్యాది మహారథులంతా మా వూరి వారే. మా ఊళ్ళో

ఏమూల కూచుని వారు సాహితీ చర్చలు చేసేవారో మా పెద్దలు ఇప్పటికీ చెబుతుంటారు. అంతెందుకు యిప్పటి కొచ్చి ఆ సాంప్రదాయం మావూళ్లో బతికేవుంది. బహుశా శారద మహారచయిత కావడానికి అతను హోటళ్లో పనిచేయడ మొక్కటే కాదు. అక్కడ ఇట్లాంటి సమావేశాలు జరిగి అతడ్ని ఉత్తేజపరిచి వుండాలి.

కనుక హోటళ్ళని తక్కువ చేయరాదని యిందు మూలకంగా మనవి చేసుకుంటున్నాను. అట్లాంటిది మా రావుడికి హోటలంటే బొత్తిగా పడదు. అప్పుడప్పుడు నా పోరు పళ్ళేక అనుసరిస్తాడంతే. మొన్నీమధ్యనే హోటళ్లో కూచున్నాం. సర్వరుకోసం ఎదురు చూస్తున్నాం. అయిదు నిముషాలు గడిచింది. ఎవరూ రాలేదు. పది నిముషాలకు ఒకడొచ్చాడు. బాబూ అని చెప్పబోతుండగానే వెళ్ళిపోయేడు. ఈ వార్డు వీడిది కాదు అన్నాడు రావుడు. పావుగంట గడిచినా సర్వరు రాలేదు. సరిగ్గా ఇరవై ఏడు నిమిషాల కొచ్చేడు మా వార్డు సర్వరు. వచ్చేడేకాని మాటాడకుండా ఏం కావాలని కళ్ళెగరవేశాడు. ముందు మంచినీళ్ళు కావాలి అన్నాను. రెండు వేళ్ళు నోట్లో పెట్టుకొని చిన్న విజిల్ కొట్టేడు. (మీరు నమ్మాలి) ఆ విజిల్‌కి సమాధానంగా పదేళ్ళ కుర్రాడు పది గ్లాసుల్తో వచ్చేడు. వాడి చేతికున్న పదేళ్ళూ గ్లాసుల్లో మునిగి వున్నాయి. మురికి బట్టలు చిరిగి మోకాళ్ళమీద వేలాడుతున్నాయి. బట్టలకంటే మురికిగా వున్నాడు మనిషి. నాలుగు గ్లాసులు మా బల్లమీదుంచేడు. ఎక్కడ్నించో ఇంకో విజిల్ వినిపిస్తే అటు పరుగెత్తేడు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఏం కావాలో చెప్పండి అన్నాడు ఇంకా అక్కడే నిలబడ్డ సర్వరు. రావుడి వైపు చూసేను. నీ యిష్టమొచ్చింది చెప్పు అన్నాడు రావుడు. ఏమున్నాయి అన్నాను సర్వర్తో. తాంబూళం నోరు విప్పేడు. మొహం మీద మొహం పెట్టేడు. ఉమ్మి తుప్పర్లు రాల్తుండగా వంద మైళ్ళ స్పీడులో లిస్టు చదివేడు. ఇడ్లీ, పెసరాట్, మినపాట్ అతన్నాపకపోతే ఉమ్మి వర్షంతో తడిసిపోయే ప్రమాదాన్ని వూహించి, రెండిడ్లీ అన్నాను.

మరో పది నిమిషాల్లో ఇడ్లీలు తెచ్చాడు. అస్తమానం అటూ ఇటూ తిరగడంవల్ల అతను చెమటతో తడిసివున్నాడు. అతన్ని చూడడం మాని ఇడ్లీలు తినడం ప్రారంభించేను. రెండు రాళ్ళు పంటికింద పడ్డాయి. రావుడి వైపు చూశాను. వాడి పళ్ళకింద ఏం పడ్డాయోగాని వాష్ బేసిన్ దగ్గరికి పరుగెడుతున్నాడు. నేను వాడ్ని అనుసరించేను చేతులు కడుక్కుంటూ పక్కకి తొంగి చూసేను. అది కిచెన్. అక్కడ నానా బీభత్సంగా వుంది. ఎంతో గలీజుగా వుంది. మనిషికో వెయ్యి చొప్పున ఈగలున్నాయి. అక్కడే బురదగుంట కూడా వుంది. దానిమీద దోమలు తిరుగుతున్నాయి. కొంచెం అవతలగా రెండు గజ్జికుక్కలున్నాయి. కప్పులూ, సాసర్లూ, గ్లాసులూ అన్నీ ఒక తొట్టిలోనే కడుగుతున్నారు. కడుగుతున్నారంటే కడుగుతున్నారని కాదు. నీళ్ళలో ముంచి తీస్తున్నారంతే. రుబ్బురోళ్ళ కాద పప్పు రుబ్బుతూ చెమటని చేత్తో విదిలిస్తున్నాడు రుబ్బుడు మేస్టారు. పక్కనే కాఫీ, టీలు తయారు చేసేబల్ల. ఆ మనిషి పరమ అసహ్యంగా వున్నాడు. వంటిమీద చిన్న టవలు మాత్రమే చుట్టుకుని ఉన్నాడు. మురికి గుడ్డల్లో డికాక్షను వంపుతున్నాడు. మధ్య మధ్య దగ్గుతున్నాడు. ఆ పక్కనే ఊస్తున్నాడు. సరిగ్గా అక్కడే "డ్రింకింగ్ వాటర్" నీళ్ళ డ్రమ్ముంది. అదే గదిలో మరో నలుగురు కాయగూరల రాసి ముందర కూచున్నారు. కత్తులూ, కటారులతో కాయగూరల్ని తరుగుతున్నారు. ఆ గుట్టమీంచి నడిచి వెడుతున్నారు. నడిచి వస్తున్నారు. చపాతీ పిండి తయారుచేసే బేచ్ మరింత నిర్దాక్షిణ్యంగా ఉంది. చేత్తోనూ, పాదాల్తోనూ, పిండిని కసా పిసా మసా చేస్తున్నారు. వంటగదిలో ఉన్న మనుష్యులందరి దుస్తులూ నూనె-దుమ్ము-మురికితో భయంకరంగా ఉన్నాయి. మంటలో వేసినా తగలడవు.

నాకు వెంటనే మరో భయానక దృశ్యం గుర్తుకు వచ్చింది. అది మిలట్రీ భోజన హోటల్. అక్కడికి ఒకసారి దయచేయండి. కిచెన్లో కోళ్ళు కేర్ కేర్‌మని అరుస్తుంటాయి. వినండి మీముందు కస్టమరు కాళ్ళు కుర్చీలో పెట్టుకుని రెండు చేతులతో తింటుంటాడు. విస్తరి పక్కనే దుమ్ములూ, చేప ముళ్ళు గుట్టా ఉంటాయి. ఈ తడవ వెళ్ళినపుడు గమనించండి. ఎదుటివాడి విస్తట్లో దినుసులు కొన్ని ఎగిరి మీ విస్తట్లో పడతాయి. సరిపెట్టుకోండి.

రసం, సాంబారు, మజ్జిగ ఇత్యాది ద్రవ పదార్థాలు ఏ విస్తట్లోంచి ఏ విస్తట్లోకి ప్రవహిస్తున్నాయో కళ్ళుండి గూడా పోల్చుకోలేం.

ఒక మనిషిని పట్టుదలకొద్దీ ఒకే హోటల్లో నెలరోజులు భోంచేస్తే అతనిమీంచి వచ్చిన ఆదాయంతో హోటల్ మొత్తానికి రంగులు వేయించ వచ్చుని ఒక లెక్క. నాలుగేళ్ళు హోటల్లో భోంచేసిన మా మూర్తి "ఆహోటల్ తలుపులూ, గొళ్ళేలూ, కిటికీలూ, తెరలూ నావిరా. నానుంచి గుంజిన డబ్బుతో ఈ అలంకారాలు చేయించేడు ప్రొప్రైటరు" అన్నాడు గర్వంగా. నిజమే మరి ఒకటి రెండు రోజులు కాదు నాలుగేళ్ళు అక్కడ కతికేడు మూర్తి.

మదరాసులో మొదటి రోజులు నాకింకా జ్ఞాపకం ఉన్నాయి. హోటల్ పేరు చెప్పనుగాని అది మిలట్రీ హోటలే. ఏ పదార్థాలు ఎట్లా ఉన్నా, అక్కడి గలీజు నాకు నచ్చేదికాదు. విసుక్కుంటూనే ఆ హోటల్లోకి అడుగు పెట్టేవాణ్ని. నా వరస నచ్చక సి. వి. రమణ నన్ను తిట్టేడు. ఎందుకట్లా అస్తమానం తిట్టుకుంటూ ఆ హోటల్కే వెళతావు, హోటల్ మార్చరాదూ అని. అప్పుడు రావుగోపాలరావు గొప్ప జోక్ వేసేరు.

"మరేం లేదండయా, కవిగార్ని హోటల్ మనిషి గురిచూసి దెబ్బ కొట్టాడు. కోడి మాంసమని ఎప్పుడో కుక్కని వడ్డించి ఉంటాడు. దాని విశ్వాసం ఈయనగారికి ఎక్కిపోయి ఉంటుంది. సింపులు లాజిక్కు.

చేతులెత్తి నమస్కరించేను గోపాలరావుగారికి. అంతకంటే ఏం బదులు చెప్పగలను.

కథా నిలయం
4539
శ్రీకాకుళం